నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

3 | నిజామాబాద్, బుధవారం 7 మే 2025 | ADILABAD NIRMAL



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

# స్థానిక ఎమ్మెల్యే హస్తంతోనే పత్తి రైతులకు నష్టం

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఎదులాపురం, మే 6 : రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా పత్తి రైతులు నిలువునా మోసపోయారని, స్థానిక ఎమ్మెల్యే ప్రైవేటు డీలర్లతో ఒప్పందం కుదుర్చుకుని రైతులకు కుచ్చుటోపీ పెట్టారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. ఆదిలాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని ప్రభుత్వ విధానాలు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే వైఖరిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొత్తం 25 లక్షల మంది పత్తి రైతులు సాగు చేసిన పత్తితో 49 లక్షల బేళ్లు ఉత్పత్తి అయ్యాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నామని అన్నారు. ఇందులో 41 లక్షల బేళ్లు సీసీఐ ద్వారా ఖరీదు చేసినట్లు చెబుతున్నారని, మరో ఎనిమిది లక్షల బేళ్లను ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసినట్లు లెక్కలు ఉన్నాయన్నారు. అయితే సీసీఐ కేవలం 6.50 లక్షల మంది రైతుల నుంచే పత్తి కొనుగోలు చేసినట్లు ఉందన్నారు. దీపావళి రోజున హైదరాబాద్‌లో కాంగ్రెస్ నేతలు, ప్రైవేటు వ్యాపారస్తులతో సమావేశమై రైతులను నిలువునా మోసం చేసే యత్నాలు ప్రారంభించారని ఆరోపించారు. తాను గతంలోనే హెచ్చరించిన విధంగా స్థానిక ఎమ్మెల్యే అందుకు సహకరించారని, తప్పుల తడకగా ఉన్న లెక్కలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, అశోక్ స్వామి, అడప తిరుపతి, ఆలం, నరేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి



పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎదులాపురం, మే 6 : కేంద్రం ప్రకటించిన అవార్డుల్లో తెలంగాణ రాష్ట్రం అనేక అవార్డులను సొంతం చేసుకుందని, ఇప్పుడు రాష్ట్రాన్ని దివాలా తీసే క్రమంలో రేవంత్‌రెడ్డి పాలన కొనసాగుతుందని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సాజిత్ ఉద్దీన్ అన్నారు. తెలంగాణ ప్రజలపై రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిరసనను చేపట్టి 420 హామీలు ప్రకటించి ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. నాయకులు సలీం పాషా, ఇజ్జగిరి అశోక్, కేమ శ్రీకాంత్, అడప తిరుపతి, అత్తరుల్లా, ఆన్సర్, ఉగ్గే విఠల్, దయానంద్, ఆలం పాల్గొన్నారు.



పరిశీలకుడితో వాదిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

రసాభాసగా మారిన కాంగ్రెస్ సమావేశం

# రసాభాసగా కాంగ్రెస్ సమావేశం

- సీఎం హోదాలో మాట్లాడడం సమంజసం కాదంటున్న నాయకులు
- ఈ నెల 15 నుంచి దశలవారీగా ఆందోళనలు

భైంసా, మే 6 : భైంసా పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమావేశం రసాభాసగా మారింది. ఈ సమావేశానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్, ఎండీ అవేస్ హాజరయ్యారు. సమావేశం కొనసాగుతుండగా.. పటేల్ వర్గీయులు పార్టీలో నూతనంగా చేరిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని, పార్టీ కోసం కష్టపడ్డ వారికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండిపడ్డారు. అంతేగాకుండా ఇందిరమ్మ కమిటీలలో వేరే పార్టీ సమావేశానికి వెళ్లిన వారు ఉన్నారని అనడంతో విఠల్‌రెడ్డి వర్గీయులు, పటేల్ వర్గీయుల మధ్య తోపులాట మొదలైంది. గంట సేపటి వరకు రసాభాస కొనసాగింది. అనంతరం కార్యకర్తలను సముదాయించడంతో కార్యక్రమం సజావుగా సాగింది. ఇందులో మాజీ ఎమ్మెల్యేలు వేణుగోపాలాచారి, నారాయణ రావు పటేల్, విఠల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఫారుక్ అహ్మద్, సూర్యం రెడ్డి ఉన్నారు.



గాదిగూడ రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# తులం బంగారం ఏమైంది?

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్, మే 6 : కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఇస్తామని ప్రకటించిన తులం బంగారం ఏమైందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గాదిగూడ మండల కేంద్రంలోని రైతువేదికలో 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు కల్యాణలక్ష్మి సాయంతోపాటు తులం బంగారం ఇస్తామని ప్రకటించింది. 16 నెలలు దాటినా అమలు చేయడం లేదు. ప్రజలకు మోసపూరిత హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో శ్రీనివాస్‌కు సూచించారు. నార్నూర్, గాదిగూడ మండలాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు లోకారి(కే), ఖండోతోపాటు పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దాబా(కే)లో తల్లిదండ్రుల మృతితో అనాథలైన పిల్లలను పరామర్శించి అన్ని విధలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, డిప్యూటీ తహసీల్దార్ విలాశ్, మాజీ ఎంపీపీ ఆడా చంద్రకళ రాజు, గాదిగూడ మాజీ వైస్ ఎంపీపీ మర్సువనే యోగేశ్, గాదిగూడ మండలాధ్యక్షుడు పుసం బాదిరావు, నార్నూర్ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావు, రాయిసెంటర్ సార్ మెడి మెస్రం దుర్గు పటేల్, నార్నూర్ సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఆగ్రహజ్వాల

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై సర్వత్రా చర్చ



# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

- రూ.27లక్షల విలువ చేసే 27 ఆటోలు, ఐదు సెల్ ఫోన్‌లు స్వాధీనం
- ఐదుగురు అరెస్టు.. పరారీలో ఇద్దరు..
- వివరాలను వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, మే 6 : ఆటోలను దొంగిలించి విక్రయిస్తున్న ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. తక్కువ సమయంలో అధిక డబ్బు సంపాదించాలని ఏడుగురు ముఠాగా ఏర్పడ్డారు. ఇందులో రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన(ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్కే కాలనీలో ఉంటున్నాడు) యూసుఫ్(ఏ1), ఆదిలాబాద్ జిల్లా జైనూర్‌కు చెందిన సయ్యద్(ఏ2), పట్టణంలోని రణదివ్యనగర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ షారుఖ్ పఠాన్(ఏ3), మేస్త్రీ అల్తాఫ్‌ఖాన్ (ఏ4), నార్నూర్ మండలంలోని నాగలకొండ గ్రామంలో వ్యవసాయం చేస్తున్న షేక్ ఖయ్యూం (ఏ5), ఆటో డ్రైవర్ అఫ్సర్‌బేగ్(ఏ6), మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మాహోర్ తాలూకా గొండ్వవర్సా గ్రామానికి చెందిన మేస్త్రీ అసద్‌ఖాన్(ఏ7)లు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరందరూ ఆటోలు దొంగతనం చేయడం ప్రారంభించారు. అలా 27 ఆటోలను దొంగిలించి వాటి ప్లేట్ నంబర్లు, ఇంజిన్ నంబర్లను మార్చి విక్రయానికి ప్లాన్ చేశారు. ఈ క్రమంలో ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ వంతెన వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో షారూఖ్ పఠాన్ ఆదిలాబాద్‌లో దొంగిలించిన ఆటో(టీఎస్ 01 యూఏ 0832)తో అనుమానాస్పదంగా కనిపించాడు. అతనిని విచారించగా ఏడుగురు ముఠా సభ్యులు అందరూ కలిసి హైదరాబాద్, ఆదిలాబాద్‌లలో ఆటోలను దొంగిలించామని తెలిపాడు. షారూఖ్ పఠాన్‌ను విచారించిన సందర్భంలో అల్తాఫ్ ఖాన్ వద్దకు తీసుకువెళ్లగా అక్కడే షేక్ ఖయ్యూం ఉన్నాడు. వీరి వద్ద 15 ఆటోలు లభ్యమయ్యాయి. వీరూ అఫ్సర్ బేగ్, అసద్ ఖాన్ ఇంటి వద్దకు వెళ్లగా అక్కడ 11 ఆటోలు దొరికాయి. వీరిపై హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు ఆరు కేసులు నమోదయ్యాయి. ఈ ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా.. యూసఫ్, సయ్యద్‌లు పరారీలో ఉన్నారు. 27 ఆటోల విలువ రూ.27లక్షల వరకు ఉంటుంది. ఈ సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ కే ఫణిదర్, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై సయ్యద్ ముజాహిద్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్, మే 6(నమస్తే తెలంగాణ) : కరువు భత్యం ఇవ్వాలని, పీఆర్సీ ప్రకటించాలని ఉద్యోగ సంఘాల డిమాండ్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగుల గురించి చేసిన వ్యాఖ్యలు ఆదిలాబాద్ జిల్లాలోని ఉద్యోగుల్లో ఆగ్రహానికి కారణమయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయంశంగా మారాయి. తమకు ఇవ్వాల్సిన వాటిని అడగడంతో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని ఉద్యోగ సంఘాల నాయకులు అంటున్నారు. కష్టపడి పనిచేస్తూ ప్రభుత్వ పథకాల అమలు కోసం పనిచేస్తున్నామని చర్చించుకుంటున్నారు. సీఎం వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజలు ఈ వ్యాఖ్యలను ఆసక్తిగా వింటున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల గురించి ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని జనం అంటున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

### సీఎం భాష సరిగా లేదు..



ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏలు, పీఆర్సీ విషయం అడిగితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాష సరిగా లేదు. రెండు శాతం ఉన్న ఉద్యోగులు 98 శాతం మంది ప్రజలపై సమరం చేస్తారా? అని వ్యాఖ్యానించడం సరికాదు. తాము ప్రభుత్వ పథకాలను ఆపమని ఏ నాడు చెప్పలేదు. 16 నెలలుగా తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు ఇస్తున్నా ఫలితం ఉండడం లేదు. రిటైర్డ్ ఉద్యోగులు జమ చేసుకున్న డబ్బులను కూడా ఇవ్వడం లేదు. బోనస్, కొత్త డిమాండ్లను ఏమీ అడగడం లేదు. డీఏలు ఇస్తే ఒక్కో ఉద్యోగికి రూ.10 వేల వరకు జీతం పెరుగుతుంది. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీ వేసి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఉద్యోగ సంఘాల నాయకులతో ఒక్క సమావేశం నిర్వహించలేదు. ఉద్యోగులకు హెల్త్‌కార్డులు లేవు. ప్రభుత్వం ఆర్థికేతర అంశాలను పట్టించుకోవడం లేదు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉద్యోగుల పెండింగ్ బకాయిల చెల్లించడానికి రూ.500 కోట్లు ఫిబ్రవరిలో విడుదలు చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు నయా పైసా ఇవ్వలేదు. ఉద్యోగులు రాష్ట్ర ఆదాయం పెంచాలని అంటున్నారు తప్ప మా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం లేదు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఈ నెల 15 నుంచి దశలవారీగా ఆందోళనలు చేపడుతాం.

- సంద అశోక్, ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్, ఆదిలాబాద్ జిల్లా

# కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుంట లేదు

- మేమే మట్టి తరలించి రోడ్డు బాగు చేసుకున్నం..
- రాంజీగూడ ఆదివాసీ గిరిజనులు

ఇంద్రవెల్లి, మే 6 : వడగాం గ్రామ పంచాయతీ పరిధిలోని రాంజీగూడకు చెందిన ఆదివాసీ గిరిజనులు మట్టిరోడ్డుకు మరమ్మతు చేపట్టారు. మంగళవారం గ్రామస్తులందరు కలిసి సొంత డబ్బులతో ట్రాక్టర్ ద్వారా మొరం తరలించారు. గుంతలతో అధ్వానంగా మారిన మట్టిరోడ్డుపై మొరం పోసి మరమ్మతులు చేపట్టారు. గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు సెడ్మకి సుంగు, సెడ్మకి హరిదాస్, తొడసం జంగు, సెడ్మకి పోల్లు తెలిపారు. దీంతో అందరం కలిసి కొంత డబ్బులు జమ చేసుకుని, ట్రాక్టర్ ద్వారా మొరాన్ని తరలించి మట్టిరోడ్డుకు ఏర్పడిన గుంతలను పూడ్చి మరమ్మతులు చేశామని తెలిపారు.



మట్టిరోడ్డుపై ట్రాక్టర్‌తో మొరం పోసి మరమ్మతులు చేపడుతున్న ఆదివాసీ గిరిజనులు

# స్వయం ఉపాధికి కార్యాచరణను వేగవంతం చేయాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, మే 6 : స్వయం ఉపాధికి కార్యాచరణను వేగవంతం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకంపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ఎకానమిక్ సపోర్ట్ స్కీమ్‌లను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన అర్హులైన అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 20 లోగా జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల రెవెన్యూ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఎల్‌డీఎం రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కటకటాల్లోకి గొలుసు దొంగలు

- వివరాలను వెల్లడించిన భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్




వివరాలు వెల్లడిస్తున్న భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్

సోన్, మే 6 : రోడ్డుపై వెళ్తున్న దంపతులను అడ్డగించి, వారి వద్ద నుంచి బంగారు గొలుసు లాక్కొని చివరికి కటకటాల పాలైన ఘటన నిర్మల్ మండలంలో చోటు చేసుకున్నది. భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్ వివరాలను వెల్లడించారు. నిర్మల్ నుంచి మండలంలోని వెంగ్వాపేట్ గ్రామానికి గత నెల 30న రాత్రి దంపతులు మోటారు సైకిల్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో కావేరి కుటీర్ వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు భార్యాభర్తల నుంచి బంగారు చైన్, పుస్తెలతాడు అపహరించారు. దీంతో బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. మంగళవారం ఉదయం మంజులాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు చూశారు. పోలీసులు పట్టుకుని విచారించగా నాందేడ్ జిల్లా సొనారి తాలుకా పొన్నలాలకు చెందిన పర్బాజీ బాలాజీ రేల్వాడ్, నిర్మల్ మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన అలిశెట్టి శ్రీనివాస్‌లుగా గుర్తించారు. వీరు దొంగిలించిన రెండు తులాల బంగారు పుస్తెలతాడు, తులం బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. వీరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సోన్ సీఐ మున్నూరు కృష్ణ, ఎస్సై జి.లింబాద్రి, కానిస్టేబుల్స్ సంతోష్, సత్యనారాయణ పాల్గొన్నారు.